క్లుప్తంగా

పెయింటింగ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం విశాఖలోని ఎన్ఎస్ఆర్‌ఆటీ కళాశాలలో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఆంధ్రా టెక్ లీగ్ పోటీలకు సంబంధిత పాఠశాల నుంచి 8,9 తరగతులకు చెందిన 25మంది విద్యార్థులు హాజరయ్యారు. త్రీడీ ద్రోణాచార్య పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

పాయకరావుపేట : వినాయక చవితి సందర్భంగా వినాయక నవరాత్రులు, వినాయక పూజలు కోసం వీధుల్లో ఏర్పాటు చేసే పందిళ్ళకు, మండపాలకు పోలీసు స్టేషన్ నుంచి పర్మిషన్ తీసుకోవాలని సీఐ పి.అప్పలరాజు తెలిపారు. ప్రైవేట్ స్థలంలో మండపాలు ఏర్పాటు చేస్తే స్థలం యాజమాని అనుమతి తీసుకోవాలన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి కూడా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు ఉపయోగించాలన్నారు.

హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష తగదు

అచ్యుతాపురం(అనకాపల్లి): హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రిసోర్స్ పర్సన్ గోవిందరావు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్లలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ రోగులకు అవకాశం ఉన్నంత మేరకు ప్రభుత్వ పథకాలు అందజేయాలని సూచించారు. మహిళా పోలీస్ కుమారి దిశా యాప్ గురించి అవగాహన కల్పించారు. కె.శివ, శ్రీనివాస్, అరుణ, ఫణీంద్ర, రమ్య, లక్ష్మి, చందు, సరస్వతి పాల్గొన్నారు.

నేడు ఘనంగా కృష్ణుని అనుపు మహోత్సవం



మునగపాకలో శ్రీ కృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణుని విగ్రహ అనుపు మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు శ్రీ కృష్ణ బాలల యువజన సంఘ సభ్యులు తెలిపారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సంతబయిల ఏర్పాటు చేసిన విగ్రహానికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం కోలాటాలు, సేవగరిడీలు, చిటికల భజనల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అనుపు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అనుపు మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పాఠశాల విద్యార్థులకు వితరణ

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని రామన్నపాలెంకు చెందిన దివంగత పత్రికా విలేకరి సన్యాసిరావు జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. దివ్యాంగుల ఆశ్రమంలోని విద్యార్థులకు అందించిన పుస్తరాలు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ అనంతరం మధ్యాహ్న భోజనం అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ లక్ష్మి, ధర్మిరెడ్డి అప్పలనాయుడు, ధర్మిరెడ్డి రాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


యండపల్లిలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

కోటవురట్ల: ప్రతి రైతు పండించిన పంటను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. స్థానిక ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బందితో ఈ-పంట నమోదుపై సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించి ఈ-పంట నమోదు చేయించాలన్నారు. అనంతరం యండపల్లిలో జరుగుతున్న ఈ-పంట నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వ్యవసాయాధికారి సరోజిని, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో రాజయ్యపేటలో సీసీ రోడ్డు


రాజయ్యపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కుళ్లాయి రెడ్డి తదితరులు

నక్కపల్లి : మండలంలోని మత్స్యకార గ్రామం రాజయ్యపేటలో హెటిరో పరిశ్రమ యాజమాన్యం రూ.70 లక్షలు సీఎస్ఆర్ నిధులు కేటాయించి 2 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి ముందుకొచ్చింది. కంపెనీ జీఎంలు సుబ్బారెడ్డి , కుళ్లాయిరెడ్డి, రాజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ శుక్రవారం రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రాజయ్యపేటలో రోడ్డు సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించిన కంపెనీ చైర్మన్ పార్థసారథి రెడ్డికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కంపెనీ ప్రతినిధులు కుళ్లాయిరెడ్డి, సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ ఇప్పటికే సీఎస్ఆర్ నిధులతో పాఠశాలల్లో మినరల్ వాటర్‌ప్లాంట్లు, బెంచీలు, ప్రహరీ గోడలు, క్రీడామైదానాల అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలకు కంప్యూటర్ల వితరణ వంటి కార్యక్రమాలు కంపెనీ చేపడుతోందన్నారు. నక్కపల్లిలో ఉచితంగా కంటి ఆస్పత్రి ఏర్పాటు చేసి అన్నివర్గాల వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందించడం జరుగుతోందన్నారు. నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో రోగుల కోసం ఆధునికమైన వైద్యపరికరాలు, మినరల్ వాటర్‌ప్లాంట్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు కంపెనీ యాజమాన్యం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ సత్తియ్య, స్థానిక నాయకులు కోదండరావు, రాంబాబు, తాతీలు, నగేష్, సూరిబాబు, కాశీ, సిఎస్ఆర్ సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట తప్పని నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

- అక్క చెల్లెమ్మలకు ఆసరాతో ఉపాధి
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- 17 డ్వాక్రా సంఘాలకు రూ.69.95 లక్షలు ఆసరా పత్రాల పంపిణీ


డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : మాట తప్పని నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. మున్సిపాలిటీలో గతంలో సాంకేతిక సమస్య వల్ల కొన్ని డ్వాక్రా సంఘాలకు వైయస్సార్ ఆసరా వారి ఖాతాల్లో జమ కాకపోవడంతో గురువారం వారికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.69.95 లక్షలను 17 డ్వాక్రా సంఘాల గ్రూపు సభ్యులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు స్వయం ఉపాధిని కల్పిస్తుందని సీఎం జగన్‌మోహనరెడ్డి ఎన్ని అడ్డంకులు ఎదురైనా డ్వాక్రా మహిళలకు క్రమం తప్పకుండా 3 విడతల్లో ఆసరా సొమ్ము చెల్లిస్తున్నారని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకమైన పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలు, సంక్షేమాన్ని గుర్తుపెట్టుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రతి మహిళ తోడ్పడాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, డీఈ వీరయ్య, మేనేజరు ప్రభాకరరావు, టౌన్ ప్లానింగ్ అధికారిణి శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు డ్వాక్రా సంఘాల అధికారులు పద్మావతి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం


మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు కోరారు. మునగపాక దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన మట్టి వినాయక విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల జోలికి వెళ్లరాదని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం శివకోటి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, అంబేద్కర్ జమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు


మూలపేటలో పింఛన్‌లు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూలపేటలో కొత్త పింఛన్లను ఆయన అందజేశారు. గంగప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మళ్లీ పట్టం కట్టాలన్నారు. సచివాలయ కన్వీనర్ బొడ్డేడ ఆదికుమార్, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నరేంద్రపురంలో కొత్త పింఛన్ల పంపిణీ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నరేంద్రపురంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. సర్పంచ్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు చేతుల మీదుగా నూతన పింఛన్లు పంపిణీ చేశారు. చందక శివ, బాబ్జి, చిన్ని రాజు, ధూళి నర్సింగరావు, రమణ పాల్గొన్నారు.

దైవ చింతన అలవరచుకోవాలి


మునగపాకలో శ్రీ కృష్ణుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకలోని సంతబయిల శ్రీ కృష్ణ బాలల యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఆయన శుక్రవారం రాత్రి దర్శించుకొని పూజలు చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ దేవాలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్


క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు


పాయకరావుపేటలో జరిగిన పోటీల్లో ఎంపికైన విద్యార్థులు

కోటవురట్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలలో కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాములవాక జెడ్పీ స్కూల్లో జరిగిన పోటీలలో వివిధ విభాగాల్లో క్రీడా నైపుణ్యం ప్రదర్శించారు. అండర్ 17లో కబడ్డీలో ప్రథమ, ఖోఖో ద్వితీయ స్థానం పొందారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలలో కబడ్డీకి నలుగురు, వాలీబాల్‌కు ముగ్గురు, ఖోఖోకు ముగ్గురు, త్రోబాల్‌కు ఒకరు ఎంపికైనట్టు హెచ్‌ఎం షేక్ అల్లాఉద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను హెచ్‌ఎం అల్లాఉద్దీన్, పీడీ లక్ష్మి అభినందించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల స్కూల్ గేమ్స్ కై ట్స్ విద్యా విహార్ ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగాయి.రెండో రోజు బాలురకు వివిధ కేటగిరీల్లో కబడ్డీ,వాలీబాల్, ఖో-ఖో పోటీలు నిర్వహించారు.మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక చేయనున్నారు.

పాయకరావుపేట : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్.నర్సాపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల అంతర పాఠశాల ఆటల పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా శుక్రవారం అండర్ 17 బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, షటిల్ బాడ్మింటన్, టెన్నికాయిల్, అథ్లెటిక్స్‌ల్లో పోటీలు జరిగాయి. మండల కో ఆర్డినేటర్ కె.రత్నాలమ్మ, నియోజకవర్గ కో ఆర్డినేటర్ టి.రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్.రవికుమార్, షేక్ రెహ్మమాన్, సిహెచ్.సతీష్‌బాబు, వై.శ్యామ్, ఎ.కన్నారావు, క్రాంతికుమార్, లక్ష్మణరావు, కె.స్వామి, పిఇటీలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : దార్లపూడి ఉన్నత పాఠశాలలో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ రెండవ రోజు మండల స్థాయి పోటీలు శుక్రవారం ఉత్సాహ భరితంగా సాగాయి.అండర్ 17 విభాగం విద్యార్థులకు పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. వాలీబాల్‌లో పి.ధర్మవరం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా ద్వితీయ స్థానం దార్లపూడి నిలిచింది. బ్యాడ్మింటన్ లోఎస్.రాయవరం ప్రథమం కాగా, వమ్మవరం ద్వితీయ, త్రోబాల్‌లో పెద గుమ్ములూరు ప్రథమ, ఎస్.రాయవరం ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

రాంబిల్లి : మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాంబిల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖోఖో, త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో రాంబిల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. ఈ విద్యార్థులను శుక్రవారం హెచ్‌ఎం వేణుగోపాల్, తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ వర్మ , ఉపాధ్యాయులు అభినందించారు.


గెలుపొందిన రాంబిల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు


త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

పాయకరావుపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 న చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జరిగిన త్రోబాల్ పోటీల నందు శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థిని బంగారు రజని అండర్ 19 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికై oదని కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, కోచ్ బాలరాజు అభినందించారు.

నేడు నక్కపల్లిలో హాకీ ఎంపికలు

నక్కపల్లి : ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి హాకీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసే కార్యక్రమం శనివారం నక్కపల్లిలో జరుగుతుంది. జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగే ఈ ఎంపిక కార్యక్రమానికి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి సుమారు 200 మంది హాకీ క్రీడాకారులు హాజరవుతారని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి


ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

రాంబిల్లి : వైఎస్సార్‌సీపీ విజయం కోసం అందరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు) సూచించారు. వాడనర్సాపురంకు చెందిన కొవిరి వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమించడంతో ఆయన ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ , వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటయ్య, సోమేష్, నూకరాజు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


లాలంకోడూరులో పోషకాహార వారోత్సవాలు

రాంబిల్లి : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు అన్నారు. లాలంకోడూరులో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోషకాహార ప్రాధాన్యాన్ని అందరూ గుర్తించాలన్నారు. టాటా ట్రస్టు, ఏషియన్ పేయింట్స్, విజయవాహిని ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోషకాహార తయారీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, పోషణ సఖిలు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో మెరుగైన వైద్య సేవలు

కోటవురట్ల : కె.తంగేడు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను డీఎంహెచ్‌వో హేమంత్ పరిశీలించారు. భవనంతో పాటు మౌలిక సదుపాయలు, రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవలకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామ స్థాయిలోనే మేలైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందన్నారు.

విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఉన్నత పాఠశాల, ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం హరిపాలెం-అందలాపల్లి సత్యసాయ సేవా మండలి, విశాఖ కంటి ఆస్పత్రి సౌజన్యంతో కంటి పరీక్షలు నిర్వహించారు. 280 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరం అయిన వారికి ఉచితంగా చేస్తామని నిర్వాహకులు,వైద్యులు తెలిపారు. నిర్వాహకులు ఆదీశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట

ఎమ్మెల్యే బాబూరావు


విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: విద్యతోపాటు క్రీడలలకు కూడా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం నక్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు విద్యార్థులతో కలసి కబడ్డీ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యతోపాటు క్రీడలు కూడా అసవరమని గుర్తించి ప్రతి పాఠశాలలకు వేలాది రూపాయలు విలువైన క్రీడాపరికరాలను సమకూర్చడం జరిగిందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్యలోను, ఉద్యోగ నియామకాల్లోను ప్రాధాన్యం ఉంటుందనే ఉద్దేశ్యంతో పాఠశాలల్లో ఆటల పోటీలను ప్రభుత్వం తరపున నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారన్నారు. నక్కపల్లిలో ఉన్న బీఎస్ హాకీ క్లబ్‌కు క్రీడా మైదానం కేటాయించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలు ఉపయోగించుకుని క్రీడా కార్యక్రమాల్లో రాణించి పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు జనపరెడ్డి శేషారత్నం, సర్పంచ్ నేతల రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఎంఈవో కుంచం నరేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష


మాట్లాడుతున్న తిమ్మరాజుపేట సర్పంచ్ మంగలక్ష్మి


ఆరోగ్య సురక్ష పై సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి భర్త కృష్ణారావు అన్నారు. తిమ్మరాజుపేట సచివాలయంలో శుక్రవారం వలంటీర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 30 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. ఉప సర్పంచ్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష పై పట్టణంలో గల లింగాల కాలనీలో ఇంటింట సర్వేను అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకుంటున్నారు. శుక్రవారం ఎంపీడీవో ఎ.సాంబశివరావు పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవోతో పాటు ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఈవోఆర్డీ వై.సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువ ఇంజినీర్లకు ఆదర్శం మోక్షగుండం


విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : భారతదేశంలో ఇంజినీరింగ్‌పై పరిశోధనలు చేసి అందరికీ యువ ఇంజినీర్లకు ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించగా చైర్‌పర్సన్ రమాకుమారి మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావుతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంజినీరింగ్‌లో నూతన ఒరవడి సృష్టించి భారతదేశంలో ఎన్నో ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారని, విశ్వేశ్వరయ్య సేవలకు మెచ్చి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత భారత రత్న పురస్కారాన్ని ఆయనకు అందించిందని అన్నారు. అనంతరం మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పలువురికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.వీరయ్య, టౌన్‌ప్లానింగ్ అధికారిణి శ్రీలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న భూ రక్ష-భూ సర్వేతో రైతులకు మేలు


మునగపాకలో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న భూ రక్ష-భూ సర్వే ద్వారా రైతులకు మేలు జరుగుతుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక రెవెన్యూ పరిధిలో శుక్రవారం ఆయన సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ గతంలో భూ తగాదాలు ఎక్కువగా ఉండేవని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన భూ సర్వే కార్యక్రమంతో వివాదాలు పరిష్కారమవుతాయన్నారు. రైతులు కూడా సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసేటపుడు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయ సర్వేయర్లు భవాని, హేమ పాల్గొన్నారు.

ఖాజీపాలెంలో ఆరోగ్య సంరక్షణపై సర్వే

అచ్యుతాపురం(అనకాపల్లి): ఖాజీపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సంరక్షణపై సర్వే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పీలా నర్సింగరావు, దొడ్డి వెంకట లక్ష్మి, మామిడి శ్రీను, శశికళ, లీలావతి పాల్గొన్నారు.

నిరాశాజనకంగా సాగు విస్తీర్ణం


చిక్కాల రామారావుకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పాయకరావుపేట : జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు రైతులు వేయాల్సి వుండగా ఇంత వరకు లక్ష ఎకరాల్లో మాత్రమే పంటలు వేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి ఎం.అప్పలరాజు తెలిపారు. తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల కింద 75 వేల ఎకరాల్లో వరి సాగు వేయాల్సి వుండగా కేవలం 48 వేల ఎకరాల్లో మాత్రమే వరి వేయడం జరిగిందన్నారు. జిల్లాలో గల 10 మండలాల్లోను వర్షపాతం లోటు ఉందని ఈ నేపథ్యంలో రైతుల పంట రుణాలు రద్దు చేయాలని, స్వల్పకాలిక పంటలకు అవసరమైన విత్తనాలు ఉచితంగా రైతులకు సరఫరా చేయాలని, రైతులకు, కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుకు పెంటకోట గ్రామంలో వినతి పత్రం అందించారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని కరువు అంచనా వేయాలన్నారు. చిక్కాల రామారావు స్పందించి జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు. వినతి పత్రం అందించిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు బి.నాగేశ్వరరావు, ఆర్.దండబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు దేవవరపు వెంకటేశ్వరరావు, యజ్జల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి

మునగపాక : ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు కోరారు. నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మునగపాకలో మట్టి సేకరణ చేపట్టారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, కాలేశ్వరరావు,మల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం

రాంబిల్లి : కొత్తపేట గ్రామంలో శుక్రవారం ఇంటింటా ధర్మ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ అప్పారావు మాట్లాడుతూ, అందరూ ధర్మం పాటించాలన్నారు. అలాగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్. నూకరాజు, గగన్, గోవిందరెడ్డి పాల్గొన్నారు.